# చుట్టుపక్కల చూడరా!

– కర్లపాలెం హనుమంతరావు



## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*5*

### *ఇది ఇండియా... అది ఇంగ్లాండు!*

**దుబాయ్ లోని కొడుకు ఉద్యోగం** ఊడినందుకు దిగాలు పడ్డ అమరయ్యగారు మంచం పట్టి ఇవాళ్టికి మూడు వారాలు.

మందిచ్చే ఆచారిగారు పెదవి విరిచి "అయినవాళ్ళని పిలుపించుకోవచ్చు!" అని చెప్పి పోయారు.

షేక్‌ల రుణాల షేక్‌లో షేపులు పోయిన అమరయ్య కొడుకు కామేశ్వర్రావు తండ్రి చివరి చూపులకని దిగబడిపోయాడు. కొడుకును చూసిన ఉత్సాహంలో తండ్రి తెప్పరిల్లినట్లున్నాడు.. గానీ.. కొడుకే లోడు లేని లారీలాగా కళలేకుండా ఉన్నాడు. "ఇక్కడే ఏదైనా పనుంటే చూపించు బాబాయ్! ఎటొచ్చి ఎటుపోతుందో.. నాయన కర్మకాండలకు కూడా నా దగ్గర ప్రస్తుతానికి చిల్లి నయాపైసా లేదు" అని బయటపడ్డాడు కామేశ్వరం పినతండ్రి దగ్గర. నయాపైసా రోజుల్లోనే ఆగిపోయిన కామేశ్వరం అమాయకత్వానికి జాలిపడ్డాడు బాబాయి. "ఇక్కడి పరిస్థితులు అంతకన్నా దారుణంగా ఉన్నాయిరా బంగారూ! పెద్ద పెద్ద సాఫ్టువేర్లే వేర్లు తెగిన మొక్కల్లాగా వాలిపోతున్నారు నిన్నటిదాకా! ఇప్పుడేదో పుంజుకోబోతుందంటున్నారు గానీ.. నాకు నమ్మకంలా! ఇంక గవర్నమెంటు ఉద్యోగాలంటావా.. భారీగా ప్రకటనలు గుప్పించేసి, పరీక్షలు పెట్టి, ఇంటర్వ్యూలంటూ మిగులున్నదంతా నిరుద్యోగులనుంచీ ఊడిపించి ఇప్పుడు న్యాయస్థానాల ఆదేశాలంటూ మీన మేషాలు లెక్కబెడుతున్నారు సర్కారువారు. మన మాట వినే మంత్రెవరన్నా దొరుకుతాడేమోగానీ మంత్రిమాట వినే అధికారి దొరకద్దూ! సీయంగారు ఆదేశించినా చేద్దామా.. వద్దా అని మంచీ చెడ్డా ఆలోచించే అధికారులే ఎక్కువయారు. ఇంకాస్త ముందుగా వచ్చుంటే ఏ బై ఎలక్షన్ ప్రచారకమిటీలోనన్నా జిల్లా బాధ్యుడి కింద తాలాకా బాధ్యుడిని చేయించే అవకాశం ఉండేది"

"పోనీ.. కాంట్రాక్ట్ పనులేమన్నా ఖాళీగా ఉన్నాయేమో.. అవన్నా చూడు బాబాయ్!" అనడిగాడు కామేశ్వర్రా`వు మధ్యలోనే అందుకుని.

"చేసిన పనుల బిల్లులకే చిల్లులు పెడుతున్నార్రా ఇప్పుడు! ఒక్క గనులు తవ్వుకోవడం తప్ప ప్రస్తుతానికి ఏదీ గిట్టుబాటయే వ్యవహారంలాగా కనిపించడంలేదు. ఆ పన్లూ.. ఆగాలి.. ఆగాలి అంటూ ఓ కొత్తగాలి మొదలయింది. మధ్యలో నువ్విప్పుడెళ్ళి చేసేది మాత్రం ఏముంటుంది?"

"ఏదడిగినా మన ఆర్థిక మంత్రుల్లాగా ఏదేదో చెబుతున్నావ్. ఇంకిక్కడుండి నేను మాత్రం ఊడబొడిచేదేముంది? నాన్నెట్లాగూ పిడిరాయి మల్లేనే ఉన్నాడుగా!" అంటూ వచ్చిన దారినే విమాన మెక్కి చెక్కేశాడు కామేశ్వర్రావు.

నెలన్నర తరువాత..

ఓ రోజు మిట్ట మధ్యాహ్నం పూట చిన్నాయన భోజనం లాంటిది చేసి భుక్తాయాసం తీర్చుకునే వేళ కామేశ్వరం ఫోన్ చేసాడు. కామా, ఫుల్‌స్టాప్ లేకుండా గడగడా ఏదేదో మాట్లాడుతున్నాడు "రేపు సాయంత్రం నాలుగ్గంటలకల్లా నువ్వు ఎయిర్ పోర్టులోకొచ్చి ఉండాలి బాబాయ్! నీతో పాటు ఓ టాపులేని జీప్సీ టైపు జీపు, బేండ్ మేళం సెట్టు, తాజా గజమాలలు ఓ డజను, మంత్రాలు చదివే పంతులుగారు, ఓ వెయ్యికి చిల్లర.. అన్నీ ఐదు.. పది..పైసల బిళ్ళలే ఉండాలి బాబాయ్! మంచి కేటరింగు వాళ్ళెక్కడున్నారో విచారించి బుక్ చేసుంచు! సుమారు రెండొందల మందికి రోజంతా కాఫీ టిఫిన్లూ, మధ్యాహ్నం బఫే, రాత్రికి డిన్నర్. మన పేరడైజ్ బిర్యానీ మాదిరి స్పెషలయిటమ్స్ డజను తక్కువకాకుండా బ్రహ్మాండంగా చేసేవాళ్ళుండాలి అన్నట్లు.. ఇది.. ఫుల్ మిడ్ సమ్మర్ సీజన్ గదా.. మూసీలో నీళ్ళు నిల్ అయివుండాలి. నువ్వేం చేస్తావో తెలీదు.. ఒక్క రోజుకు వాటర్ వర్క్సు వాళ్ళతో డీల్ చేసుకునైనా సరే మూసీ ఫుల్ వాటరు అరేంజ్ చేయాలి. మనీ ఎంతైనా ఫరవాలేదు. డోన్ట్ వరీ ఎబౌట్ దట్ డర్టీ మనీ. మనకు పని ప్రధానం రిజిస్ట్రేషను వాళ్ళను కలిసి ఎల్లుండి ఉదయానికల్లా.. బిఫోర్ బెర్లిన్ ఫ్లైట్ డిపార్చర్.. ఒక డెత్ సర్టిఫికెట్ ఏర్పాటు చేయించాలి బాబాయ్! లాస్ట్.. బట్ నాట్ ది లీస్ట్.. మనకు కనీసం ఒక మూడు గంటలపాటు అలుపూ సొలుపూ లేకుండా గుక్క తిప్పుకోకుండా గుండెలు బాదుకుంటూ శోకన్నాలు పెట్టేవాళ్ళు.. అన్ని వయస్సులవాళ్ళు ఒక రెండు మూడు డజన్లకు తక్కువ కాకుండా కావాలి. గంట కింతకని మాట్లాడుకుని నేరుగా ఎయిర్ పోర్టుకే తీసుకు రావాలి. దొరుకుతారంటావా?"

అప్పటికయినా మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ఆనందం కలిగింది బాబాయికి "దేనికయినా కరువుండచ్చేమోగానీ.. ఏడ్చేవాళ్ళకి ఇక్కడ కరువేందిరా? ఆడామగా తేడా లేకుండా పిల్లా, పాపా, ముసలీ, ముతకా, అంతా చేసే పని.. చేస్తున్న పనీ.. ఇదేగదా! నల్లాల్లో నీళ్ళు వేళకి రావడం లేదని ఒకళ్ళేడిస్తే వస్తున్న ఆ కాసిని నల్లగా ఉంటున్నాయని ఇంకొళ్ళు ఏడుస్తున్నారు. కందిపప్పు నుంచి ఉప్పుకల్లు దాకా దేనిమీద చెయ్యేసినా నిప్పుకణికల్లాగా గుప్పుమంటున్నాయని గుండె మండి సంసారులు ఘొల్లుమంటుంటే, సెన్సారనేది లేకుండా సినిమాలు, టీవీ సీరియళ్ళు నట్టింట్లో కొచ్చి ఛండాలం చేస్తున్నాయని బుద్ధిజీవులు భోరుమంటున్నారు. ఆడపిల్లలకు మృగాళ్ళతో ఏడుపు, ఆఫీసు లేడీసుకి బాసులతో మొత్తుకోళ్ళు. ఆసుపత్రి వైద్యం పూర్తికాలం వ్యాపారమయిందని బీదా బిక్కీ గగ్గోలు పెడుతుంటే.. పెరిగే పెట్రోలు రేట్లతో ఫుల్ ఇండియా ఇప్పుడు శోక సముద్రంలోనే మునిగి ఉందిరా బాబూ ఇక్కడ. అదలా ఉంచూ.. ఇంతకీ ముందు నీ ఏడుపేందో చెప్పు! ఈ టాపులేని జీపులూ, బేండు మేళాలూ, పూలదండలూ, విందు భోజనాలూ, పురోహితులూ, చిల్లరా వగైరా.. వరకూ ఓ విధంగా అర్థం చేసుకోవచ్చు. ఏదో నారీ సన్మాన కార్యక్రమంలాంటిదేదో పెట్టుకుని వస్తున్నావని అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ మూసీ పానీకా మామ్‌లాక్యా? ఎల్లుండికల్లా రిజిస్ట్రారాఫీసులో అంతర్జంటుగా 'చావు ధ్రువీకరణ పత్రాలు' సృష్టించవలసింది ఏ శివైక్యం చెందినవాడికి? "

బాబాయ్ ఆవేశాన్ని అర్థం చేసుకున్న కామేశ్వరం నింపాదిగా వివరించాడు. "మొన్న ఇండియా నుండి తిరిగొచ్చిన్నాటి నుంచీ పనేమైనా దొరుకుతుందేమోనని దేశాలు పట్టుకు తిరుగుతున్నానా బాబాయ్! లండన్‌లో దొరికింది ఒక కంట్రాక్టు. షా అండ్ షా కంపెనీట.. వాళ్ళది తమాషా బిజినెస్ తరాల కిందట మనదేశం నుండి తరలి పోయి అక్కడ స్థిరపడిపోయిన బిలియనీర్లకి ఇప్పుడు కొత్త మోజు పట్టుకుందట. పుట్టటం ఎట్లాగూ మన కంట్రోలులో ఉండదుకదా! కనీసం పోయేటప్పుడన్నా ఘనంగా పోకపోతే జీవితాంతం ఇట్లా కడుపు కట్టుకుని కూడబెట్టుకుని సంపాదించిన దానికి అర్థమేముంది? అన్న కొత్త ఆలోచన మన కుబేరులలో మొదలయింది. షా అండ్ షా కమానీ ఆ కాన్సెప్టుని కేష్ చేసుకునే ఆకర్షణీయమైన స్కీములు ప్రారంభించింది. పోయిన తరువాత ఎంత గ్రాండ్‌గా సెర్మనీ చేస్తామో బ్రతికున్నప్పుడే చేసి చూపిస్తే - నచ్చినవాళ్ళు.. ఎఫర్డబుల్ ప్లాటులు బుక్ చేసుకుంటారట. ఇండియా చాలు యాత్రని ఎంత

గ్రాండ్‌గా కలర్ ఫుల్‌గా మనం ప్రాజెక్టు చేయగలిగితే.. అంత బిజినెస్ మనకు సొంతమవుతుంది. షా అండ్ షా కంపెనీకి నేనిప్పుడు ఇండియన్ ఫ్రాంఛైజీని.. అర్థమయిందా?" అని ఫోన్ పెట్టేశాడు కామేశ్వరావు.

"ఇక్కడి బీదా బిక్కీ బ్రతకలేక చస్తుంటే.. అక్కడి బిలియనీర్లకి చావుకూడా గ్రాండ్ సెర్మనీగా జరుపుకోవాలని కోరికా! ఔరా! కాలం ఎంత ఘోరంగా మారిపోతుంది!" అని నోరు తెరవడం బాబాయ్ వంతయింది.

Post your comments